క్లుప్తంగా

హోం మంత్రిని కలిసిన ఏడుకొండలు



హోం మంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సీ సెల్ జోన్ ఇన్‌చార్జి ఏడుకొండలు

గోకవరం: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు శనివారం కొవ్వూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆయనను ఎస్సీ సెల్ జోన్ ఇన్‌చార్జిగా నియమించడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలపారు. ఆయన వెంట న్యాయవాది దాకే రఘు, నాయకులు మచ్చా మోహన్, పి.రమేష్ తదితరులు ఉన్నారు.

నేడు తలుపులమ్మతల్లికి మట్టి గాజుల అలంకరణ

తుని రూరల్: లోవ దేవస్థానంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారికి ఆదివారం మట్టి గాజులతో విశేష అలంకరణ చేయనున్నట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆషాఢమాసంలో తొలి ఆదివారం కావడంతో అమ్మవారికి వివిధ రకాల మట్టి గాజులతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పిస్తామని చెప్పారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శంఖవరం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100 చెల్లించి ఈ నెల 27 లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు నెల 30న పాఠశాలలో 50 మార్కులకు పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని చెప్పారు.

200 మంది పేదలకు చీరల పంపిణీ



ఒమ్మంగిలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బీసీ నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో పేద మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. ఒమ్మంగి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో బీసీ నేత గింజాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 200 మంది పేద మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు ధారా నూకరాజు అధ్యక్షతన జరిగిన సభలో బీసీ నేత శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ సేవే మాధవసేవ అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ మహిళా నేత దేవర అనూష యాదవ్, ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, జాతీయ బీసీ సంఘం నేత నైదాన రఘు, సీమాంధ్ర బీసీ సంఘం నేత ఒమ్మి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి గ్రామాల్లో అధికారుల పర్యటన

కోటనందూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి 20 వరకూ అధికారుల బృందం గ్రామాల్లో పర్యటిస్తుందని ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ శనివారం తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో నెలకొన్న సమస్యల పరిష్కారమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల వారీగా అధికారుల పర్యటన షెడ్యూల్‌ను ఆయన ప్రకటించారు. జూలై 1న ఇందుగపల్లి, 3న అల్లిపూడి-1, 4న జగన్నాథపురం, 5న అల్లిపూడి-2, 6న కాకరాపల్లి, 7న బిళ్లనందూరు గ్రామాల్లో అధికారులు పర్యటిస్తారన్నారు. 10న బొద్దవరం, 11న కోటనందూరు-1, 12న భీమవరపుకోట, 13న కోటనందూరు-2, 14న కేఈ చిన్నయ్యపాలెం, 15న కేఏ మల్లవరం, 17న పాతకొట్టాం, 18న కొత్తకొట్టాం, 20న ఎస్సార్ పేట గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామని ఎంపీడీఓ శర్మ వివరించారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ అన్నారు. మండలంలోని వెదురుపాక, అచ్యుతాపురం గ్రామాల్లో జగనన్న సురక్షపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల శ్రీను, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అతివలకు కొండంత అండ

- మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి
- డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు
- చిరువ్యాపారాలను ప్రారంభిస్తున్న అక్కచెల్లెమ్మలు
- స్వయం సమృద్ధి దిశగా అడుగులు

ప్రత్తిపాడు రూరల్: అతివల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళలకు పలు పథకాల ద్వారా రుణాలు అందజేస్తోంది. వారిలో ఉపాధి అవకాశాలను మెరుగు పరిచి ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహిస్తోంది. డ్వాక్రా సంఘాల మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు ఇవ్వడంతో పాటు వారి జీవనోపాధికి మార్గాలను చూపిస్తోంది. మహిళా సంఘాలకు చెందిన పలువురు బ్యాంకుల నుంచి రుణాలను తీసుకుని చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించారు. ఆయా రంగాల్లో రాణిస్తూ స్వయం సమృద్ధి సాధిస్తున్నారు.

1,390 స్వయం సహాయక సంఘాలకు రూ.57.22 కోట్ల రుణం

ప్రత్తిపాడు మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం మేరకు మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించారు. డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతి పథానికి సంబంధించి మండలంలో 1,980 మహిళా సంఘాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,390 స్వయం సహాయక సంఘాలకు రూ.57.22 కోట్లు బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు ఇచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని సంఘాలకు లింకేజీ రుణాలు ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

గరిష్టంగా రూ.20 లక్షలు

కొత్త సంఘాలు ఏర్పాటు చేసుకుని తీర్మానం చేసుకుంటే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ బ్యాంకులు రుణం ఇస్తున్నాయి. వీటిని సక్రమంగా చెల్లిస్తే బ్యాంకులు లింకేజీ రుణాలను మరింత పెంచుతున్నాయి. ఈ విధంగా ఒక్కో సంఘం గరిష్టంగా రూ.20 లక్షల వరకూ రుణం పొందే అవకాశం ఉంది.

గడువులోపు చెల్లిస్తే సున్నా వడ్డీకి అర్హత

రుణాలను గడువులోగా చెల్లించే మహిళా సంఘాలు వైఎస్సార్ సున్నావడ్డీ పథకానికి అర్హత పొందుతాయి. స్వయం సహాయక సంఘాల పనితీరు ఆధారంగా ఏబీసీడీ గ్రేడ్లుగా విభజిస్తున్నారు. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావడం వంటి అంశాల ఆధారంగా సంఘాలకు గ్రేడింగ్ ఇస్తారు. ఈ గ్రేడులు ఆధారంగా రుణాలు మంజూరు చేస్తారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



నా పేరు మునసాల దేవి. మాది ధర్మవరం గ్రామం. నేను శ్యామలా స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా ఉన్నాను. ఈ సంఘం ద్వారా తొలిసారిగా రూ.17 వేలు రుణం పొందాను. రుణమాఫీ అనంతరం రూ.75 వేలు రుణాన్ని తిరిగి పొందాను. వచ్చిన సొమ్ములతో పాత అప్పులు తీర్చుకొన్నాను. అనంతరం వైఎస్సార్ ఆసరా రూ.10 వేలు, అమ్మఒడి ద్వారా రూ.15 వేలు, జగనన్న తోడు రూ.10 వేలు ప్రభుత్వం నుంచి వచ్చింది. ఈ సొమ్ముతో బ్యూటీ పార్లర్ పెట్టాను. బ్యూటీ పార్లర్ ద్వారా నెలకు రూ.20 వేలు ఆదాయం వస్తోంది. మా కుటుంబానికి అండగా నిలిచిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

టైలరింగ్‌తో ఉపాధి



నా పేరు రెడ్డి సుమలత, ప్రత్తిపాడుకు చెందిన నేను ప్రియాంక స్వయం సహాయక సంఘం సభ్యురాలుగా ఉన్నాను. భర్త మరణానంతరం డ్వాక్రా సంఘంలోకి వచ్చి టైలరింగ్ నేర్చుకొని దాన్ని జీవనాధారంగా మార్చుకొన్నాను. స్త్రీనిధి రుణం రూ.50 వేలతో రెండు కుట్టు మెషీన్లు, వైఎస్సార్ ఆసరా రూ.18 వేలతో టైలరింగ్ మెటీరియల్ కొనుగోలు చేసి వ్యాపారాన్ని విస్తరించారు. స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజీ రుణాలతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేశాను. ప్రస్తుతం ఖర్చులు పోయి రోజుకు రూ.8 వందలు వరకూ ఆదాయం వస్తోంది.

పూతరేకుల వ్యాపారం ప్రారంభించాను



నా పేరు కాకినాడ దుర్గ. పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన నేను శ్రీరామా స్వయం సహాయక సంఘం సభ్యురాలుగా ఉన్నాను. డ్వాక్రా సంఘం ద్వారా పొందిన రూ.30 వేలు రుణం తీసుకుని పూతరేకుల తయారీని ప్రారంభించాను. అనంతరం రూ.60 వేలు బ్యాంకు లింకేజీ రుణంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేశాను. ప్రభుత్వ సహకారంతో వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా మరో రూ 1.90 లక్షల రుణం, సొంత నిధులు రూ.10 వేలతో వ్యాపారాన్ని మరింత విస్తరించాను. ప్రస్తుతం జిల్లాతో పాటు ఒడిశాలోని తెలుగు వారికి పూతరేకులు సరఫరా చేస్తున్నాను.



స్వయం సహాయక సంఘాలతో సమావేశమైన ఏపీఎం వెంకట్

ప్రత్తిపాడు మండలంలోని స్వయం సహాయక సంఘాల వివరాలు

మహిళా సంఘాలు:	1980
సంఘాల్లో ఎ గ్రేడ్ 1058, బి గేడ్ 771, సి గ్రేడ్ 151, డి గ్రేడ్ 0	
మహిళా సంఘాల సభ్యులు	21,682
వైఎస్సార్ ఆసరా నాలుగు విడతల్లో విడుదలైన మొత్తం	రూ.42.16 కోట్లు
బ్యాంకు లింకేజ్ ద్వారా రుణాలు పొందిన డ్వాక్రా సంఘాల సంఖ్య	1390
డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన రుణాలు మొత్తం	57.22 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా లబ్ధిపొందిన సంఘాల సంఖ్య	1728
సున్నా వడ్డీ కింద ఏడాదికి లబ్ధిపొందిన మొత్తం	రూ.1.13 కోట్లు
స్త్రీనిధి పొందిన డ్వాక్రా మహిళలు	2896
స్త్రీనిధి ద్వారా లబ్ధిపొందిన మొత్తం	14.48 కోట్లు

నెలకు రూ.25 వేల ఆదాయం



నా పేరు గోనెల వెంకటలక్ష్మి. ధర్మవరం గ్రామానికి చెందిన నేను మణికంఠ స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా ఉన్నాను. స్వయం సహాయక సంఘంలో చేరక ముందు గృహిణిగా ఉంటూ చింత పండు పిక్క తీసేదానిని. అనంతరం డ్వాక్రా సంఘంలో చేరి సొంత నిధులు రూ.10 వేలు, బ్యాంకు రుణం రూ.55 వేలతో చింతపండు వ్యాపారం ప్రారంభించాను. అనంతరం డ్వాక్రా సంఘం ద్వారా అప్పు , స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు పొంది వ్యాపారాన్ని మరింతగా విస్తరించారు. వారానికి రూ.80 వేల పెట్టుబడితో రెండు టన్నుల చింతపండు కొనుగోలు చేసి దాన్ని వృద్ధి చేసి విక్రయించడం ద్వారా పెట్టుబడి పోను నెలకు రూ.25 వేల ఆదాయం వస్తోంది.

జీవనోపాధికి భరోసా

స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవనోపాధికి వంద శాతం భరోసా కల్పిస్తున్నాం. సంఘాలకు బ్యాంకుల ద్వారా గరిష్టంగా రూ.20 లక్షల రూణాలు ఇచ్చే అవకాశముంది. దీంతో పాటు స్త్రీనిధి కింద అన్ని వర్గాల మహిళలకు రుణసదుపాయం, ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి కింద రుణాలు ఇస్తున్నాం.

– యెనుగంటి వెంకట్, ఏపీఎం, ప్రత్తిపాడు

సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూత

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- తునిలో గడపగడపకూ మన ప్రభుత్వం



తునిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఆర్థికంగా చేయూతను ఇస్తున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని పట్టణంలోని 5, 6 వార్డుల్లో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు సుభద్రాదేవి, మర్రా సత్యవతి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి రాజా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా ప్రజల చెంతకు వెళ్లి అప్యాయంగా పలకరించారు. పలువురు మహిళలు రోడ్లు, కాలువలు, మంచినీరు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకు రాగా ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి రాజా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భగా మంత్రి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 95 శాతం మేర అమలు చేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నామన్నారు. అర్హత ఉండి ఎవరికైనా పథకాలు రాకపోతే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తారన్నారు. గత ప్రభుత్వం ప్రజలను ఓటర్లుగానే చూసిందని, తమ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా మంచి చేస్తోందన్నారు. మాట ఇస్తే చేసే దమ్ము తమ ప్రభుత్వానికి ఉందని, టీడీపీలా జన్మభూమి కమిటీల పేరుతో దోచుకోలేదన్నారు. తమ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను చూసి మరోసారి తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని మండల వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన దిగుబడులు

తొండంగి: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చని ఎస్సీ కార్పొరేషన్ ఎండీ సునీల్‌రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని బెండపూడిలో రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏలేటి ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సభలో సునీల్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగంతో భూమి నిస్సారమైపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందని, రైతులు ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విభాగం, ఎస్సీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సమకూర్చిన డ్రమ్ములు, టార్పాలిన్లు, విత్తనాలులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ ప్రెసిడెంట్ ఆరుమిల్లి ఏసుబాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సునీత, ఏఎబీ చైర్మన్ మద్దుకూరి పెద్దబ్బు, ఎంపీటీసీ గొంతిన నాగేశ్వరరావు, ఎంటీ గోవిందరాజులు, డిస్ట్రిక్స్ కోఆర్డినేటర్ గణేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

శంఖవరం: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయమే రైతులకు మేలు అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎండీ సునీల్ రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం ఎంపీపీ పర్వత రాజుబాబు అధ్యక్షతన రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్‌మేనేజర్ ఎలియాజర్,ఏఓ పి.గాంధీ,ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



శంఖవరంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఎండీ సునీల్ రాజ్‌కుమార్

విస్తారంగా వర్షాలు

ఏలేశ్వరం: నైరుతి రుతుపవనాల ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా శనివారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉండడంతో జనజీవనం స్తంభించింది. సుమారు నెల రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలు వర్షాలకు సేదదీరారు. పట్టణంలోని లింగవరం కాలనీ, మొక్కరేవుల కాలనీ, మందుల కాలనీ, చైతన్యనగర్, రాజమండ్రి, సి.రాయవరం కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయింది. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జోరు వాన

గోకవరం: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. వాతావరణం పూర్తిగా చల్లబడడంతో ప్రజలు సేదతీరారు. వర్షానికి పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఖరీఫ్ పనులను ప్రారంభించారు.



ఏలేశ్వరంలో ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వర్షం నీరు

'ఆదిత్య' విద్యార్థినికి గోల్డ్ మెడల్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కళాశాలకు చెందిన ఫోరెన్సిక్ విద్యార్థిని అఖిల సంజన గోల్డ్ మెడల్ సాధించినట్టు కళాశాల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి శనివారం తెలిపారు. కాకినాడలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ మోడరన్ పెంటథ్లోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఓపెన్ లేజర్ రన్ ఛాంపియన్ షిప్-2023 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో ప్రథమ సంవత్సరం చదువుతున్న అఖిల సంజన పాల్గొని ప్రథమ బహుమతి, నార్మల్ రన్నింగ్ రేస్‌లో పాల్గొని తృతీయ బహుమతి సాధించినట్టు వివరించారు. ప్రతిభ చూసిన విద్యార్థిని సంజనను కళాశాల ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, తదితరులు అభినందించారు.



సంజనకు గోల్డ్ మెడల్ అందిస్తున్న నిర్వాహకులు

భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణలు

ఏలేశ్వరం: స్థానిక సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం పలు పారాయణలు పఠించారు. విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో విష్ణుసహస్ర, భగవద్గీత, లక్ష్మీఅష్టోత్తర, లలితాసహస్రనామ పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, తూమురౌతు గురయ్య, సంఘ మహిళా సభ్యులు మల్లేశ్వరి, కల్యాణి, రమ్య, మంగామణి, కామాక్షి, రేవతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులతో ప్రజలు మమేకం కావాలి

కిర్లంపూడి: ప్రజలు పోలీసులతో మమేకం కావాలని, పోలీసులంటే భయం వీడి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు అన్నారు. మండలంలోని జగపతినగరం గౌరీ శంకరులు ఆలయం వద్ద శనివారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాల నివారణ, మహిళల భద్రత, పోలీసుల విధులపై ఎస్సై రఘునాథరావు అవగాహన కల్పించారు. పోలీసులు, ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించేందుకే వారధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జూనియర్ కళాశాలకు స్క్రీన్, ప్రొజెక్టర్ బహూకరణ

తుని: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు విశాఖపట్నానికి చెందిన స్పందన చేయూత ఫౌండేషన్ రూ.40 వేలు విలువ చేసే స్క్రీన్, ప్రొజెక్టర్‌ను బహూకరించినట్టు కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఈ.బుచ్చిరాజు, సభ్యులు టి.వరహాలు, జీవీవీ సత్యనారాయణ, ప్రసాద్, పొన్నాడ శ్రీనివాస్ వీటిని అందించారు. ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, పాఠ్య పుస్తకాలు, ఆట వస్తువులను సమకూరుస్తామని ప్రకటించారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన దివ్యాంగుడు బొట్టా కృష్ణకు స్పందన చేయూత ఫౌండేషన్ సమకూర్చిన ట్రై సైకిల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అందజేశారు. కౌన్సిలర్ కర్రి సత్య జగదీష్ పాల్గొన్నారు.



తునిలో కళాశాలకు స్క్రీన్, ప్రొజెక్టర్‌ను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం చర్యలు

జగ్గంపేట: మాదక ద్రవ్యాల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్థానిక సీఐ. సూర్యఅప్పారావు అన్నారు. జగ్గంపేట అక్షర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం స్థానిక ఎస్సై విద్యాసాగర్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ క్రయవిక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్, అక్షర కళాశాల ప్రతినిధులు ఆళ్ల రవికిషోర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రౌతులపూడి: యువత గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నవరం ఎస్సై అజయ్‌బాబు సూచించారు. డ్రగ్స్ నివారణ వారోత్సవాల్లో భాగంగా శనివారం రౌతులపూడి విజేత జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ, పలవురు అధ్యాపకులు పాల్గొన్నారు.



జగ్గంపేట అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ సూర్యఅప్పారావు

సంక్షిప్తంగా..

పాలవెల్లువపై అవగాహన

రౌతులపూడి: జగనన్న పాలవెల్లువ పథకంతో పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల పశువైద్యాధికారి ఎం.వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని రాజవరం, ములగపూడి గ్రామాల్లో రైతులకు శనివారం జగనన్న పాలవెల్లువపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడి రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం అమూల్ డెయిరీతో ఒప్పందం చేసుకుందన్నారు. ఈ డెయిరీ రైతులకు ప్రైవేటు డెయిరీల కంటే అధికంగా గిట్టుబాటు ధర ఇస్తుందన్నారు. పశుపోషణకు అవసరమైన దాణా, పశుగ్రాసం వంటి వాటికి మంచి తోడ్పాడును అందిస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సోమరౌతు నాని, వైఎస్సార్ సీపీ నాయకుడు సోమరౌతు తిరుముల వెంకన్నదొర, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పంచహారతులు సమర్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో మధ్యాహ్నాం భక్తులకు అన్నదానం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సారాతో మహిళ అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శనివారం నిర్వహించిన దాడుల్లో సారాతో మహిళను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో అక్రమంగా సారా కలిగి ఉన్న అనసూరి సత్యవతిని అరెస్టు చేసి ఆమె నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అశోక్ తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన ముద్దా నూకరాజు 30 మద్యం బాటిల్స్‌తో ధర్మవరం జాతీయ రహదారిపై గల దాబా వద్ద పట్టుబడ్డాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరు పరిచారు. నిందితుడిపై ప్రత్తిపాడు ఎస్సై పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూముల పరిశీలన

రౌతులపూడి: మండలంలోని ఉప్పంపాలెం శివారు అనంతారం సమీపంలోని అటవీ భూములను డీఎఫ్ఓ ఎంవీ ప్రసాద్‌రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ మొక్కల పెంపకానికి పది హెక్టార్ల భూమి అవసరమన్నారు. దీనికి అనువైన ప్రాంతంగా అనంతారం అటవీ భూములను పరిశీలించినట్టు తెలిపారు. ఆయన వెంట రౌతులపూడి అటవీ సెక్షన్ అధికారి జి.నాగేశ్వరరావు, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.